మా శ్రీమతి ఆవిడ బొచ్చుకుక్క

"కళ్యాణీదేవి"



శ్రీధర్ మాధవిని పెళ్ళి చూపుల్లో ప్రేమించి మరీ పెళ్ళిచేసుకున్నాడు.

మాధవి చూసే చిలిపిచూపులు ఇష్టం.

మాధవి పెద్ద జడంటె ఇష్టం.

మాధవి సన్నని నడుంఅంటె ఇష్టం.

మాధవి ఆకర్షణీయమైనరూపంఅంటే .ఇష్టం

చివరికి మాధవి కట్టుకునే అందమైన

చీరలంటె ఇష్టం....

మాధవి ప్రతి కదలిక, ప్రతి మాట ఎంతో ఇష్టం.

మాధవి మొత్తంమీద ఎంతో ఇష్టం ..

అయినా మాధవికి ఆ బొచ్చు కుక్క మీదుండే అవ్యాజమైన ప్రేమ మాత్రం అతనికి సుతరామూ ఇష్టం లేదు. ఎందుకని ఎవరైనా అడుగుతే బుర్రగోక్కుని క్షణకాలం ఆలోచించి సిగ్గుపడ్డం, రహస్యంగా...."షీర్ జెలసీ" అని సమాధానం చెప్పాలి. ఆ సమాధానం, తనలోనికాంప్లెక్స్‌ని ఒక్క మాధవికి తప్ప ఎవరికి తెల్సినా అతనికి అభ్యంతరంలేదు. ఎందుకంటే ఆమె దృష్టిలో తను హీరో లాగా వెలగాలనే వెర్రికోరిక....హీరో లక్షణాలకి జెలసీ అనే లక్షణంపూర్తి వ్యతిరేకం అనిఅతని అభిప్రాయం.

శ్రీధర్, మాధవిల పెళ్ళి అయి నెల అయింది. పెట్టిన శెలవ అయిపోవడంతో ఆఫీసులో జాయిన్ అయ్యి ఇళ్ళవేటలో పడ్డాడు.

కాస్త అద్దె ఎక్కువయినా భరించే స్థితిలో వున్నందున మంచి ఇంటికోసం చూడసాగాడు. అలా అని మాధవికి ఉత్తరంలో రాశాడు శ్రీధర్. తిరిగి వెంటనే ఆమెదగ్గర్నుంచి వుత్తరంవచ్చింది క్షేమ సమాచారాలు, విరహవేదన తర్వాత—

"....మీరు మంచిఇంటికోసం వెతుకుతున్నారని రాశారు. చాలా సంతోషం. మీరు ఇల్లు వెతుకుతున్న సమయంలో ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవల్సింది-ఇంటిముందు కాస్త ఖాళీజాగా వుంటె 'సోసీ' తిరగడానికి వీలుగా వుంటుంది. అన్నట్టు మీకు రాయడం మర్చిపోయాను. 'సోసీ'ని నాతో తీసుకొస్తున్నాను. నాకు అది దగ్గర లేకపోతే తోచదు. మా తమ్ముడితో పోట్లాడిదాన్ని తీసుకొస్తున్నాను. ఈవిషయంలోమాత్రం తమ్ముడికి నామీద చెప్పలేనంతకోపంగా వుంది. చిన్నసత్యాగ్రహం లాంటిది జరిపి సోసీని నాతో తెచ్చుకునే హక్కు సంపాదించుకున్నాను. సోసీ క్షణం కన్పించకపోతే నాప్రాణం గిలగిలలాడ్తుంది. దాంతో బంతిఆట ఆడకపోతే సాయంత్రాలు చిన్నబోతాయి. దానికి నేనంటే ఎంత ఇష్టమో తెల్సా? ఒకసారి నాకు నూట నాల్గు జ్వరం వచ్చింది. పిచ్చిముండ....ఎంత బెంగ పెట్టుకుందో తెల్సా? పాలు తాగడం కూడా మానేసి నా మంచం ప్రక్కనే వుండి పోయింది.... నేనుకళ్ళు తెరిస్తే చాలు దాని రెండుకళ్ళు మంచం చివరేసి నుంచుని నా మొహంలోకి బిక్కపోయి చూసేది." మిగతా వుత్తరంఅంతా కుక్క ముచ్చటతోనే నిండి పోయింది. వొళ్ళు మండి పోయి వుత్తరాన్ని టేబిల్ మీద విసిరి కొట్టాడు ... ఈవిడగారిక్క తన మీదకంటె కూడా కుక్క మీద లవ్ ఎక్కువలాగా వుంది. వుత్తరం చివరదాకా దానికి తనమీద, తనకి దాని మీదున్న ప్రేమ రాసే బదులు..ఏవండీ... నాకిక్కడ మీరులేకుండా ఏం తోచడం లేదు.... ఎప్పుడెప్పుడు వచ్చి మీ ఒళ్ళో వాలుదామాని వుంది....మీవెచ్చని కౌగలి మీ వేడి వేడి ముద్దులు ఎప్పుడు అందుకుందామాని కలలు కంటున్నాను....అని ఎంతో రొమాంటిక్‌గా రాయొచ్చే....ఎంత

నేవు సోనీ. సోనీ.... చూడబోతె తనకి పెద్ద 'రైవల్'గా దాపురించేట్లుందే...బోల్డు నీరసపడి పోయాడు శ్రీధర్. తిరిగి వుత్సాహం పుంజు కోడానికి రెండుసార్లు హార్లిక్స్ తాగాల్సి వచ్చింది.

ఎంతయినా శ్రీమతిగారి కోరిక.... అందులోకి పెళ్ళయిన సరికొత్తలో ఇచ్చిన ఆర్డర్‌కి ఎలిజిబెత్ క్వీన్ కున్నంత పవర్ వుంటుంది. అమితాబ్ బచ్చన్ కున్నంత గ్లామర్ వుంటుంది. అందుకే అందమైన ఇంటితో పాటు ఇంటి ముందు కాస్తో, కూస్తో, ఖాళీ జాగా కోసం గాలించ సాగాడు. అతని శ్రమ ఓ పది రోజుల తర్వాత దివ్యంగా ఫలించింది. ఓ రెండు పోర్షన్లకి కలిపి ఇంటి ముందు చక్కటి ఖాళీస్థలం వుంది. మాధవికి సరదావుంటే ఎంచక్కా పూలమొక్కలు కూడా వేసు కోవచ్చని సరదా పడ్డాడు శ్రీధర్.

తాముండే పక్కవాటాలోకి కొత్తగా ?గాన టూ ఒకతను తన్ను తాను వరి చయం చేసుకున్నాడు. అతని పేరు ప్రభాకర్‌ట ఆ రోజు రాత్రి కూర్చుని భార్యా మణికి ఓ పొడగాటి వుత్తరం రాసి పారేసాడు. మసాలాలాంటి విరహవేదనని మధ్య మధ్య కలిపి, మరో అయిదు రోజుల్లో వుండే మంచి ముహూర్తానికి బయలుదేరి రావల్సిందంటూ గట్టిగా రాశాడు.

తన దగ్గరున్న సామాను వగైరాలు తీసుకుని కొత్తింటికి మారిపోయాడు శ్రీధర్. తనకి తోచిన విధంగా ఇంటిని సర్దాడు. సర్దిన తర్వాత – "ఆహాఁ ఎంచక్కా సర్దాను. నా మాధవి తప్ప కుండా మెచ్చుకుని" తీర్తుందని తనకి తనే శభాష్ చెప్పుకున్నాడు. నాలుగు రోజులు ఇట్టే గడిచి పోయి శ్రీమతి వచ్చే శుభోదయం అయింది – ఆనందోహాలతో బస్సుస్టాండ్‌కి వెళ్ళాడు శ్రీధర్ శ్రీమతిని రిసీవ్ చేసుకోడానికి.

'సోనీ'ని చేతుల్లో ఎత్తుకుని మహా రాణీలా బస్సుదిగింది మాధవి. భర్తని చూస్తూనే సిగ్గు, ఆనందం, చిలిపితనం మొదలయినవి తాళింపు పెట్టిన చిరునవ్వొకటి సుందరంగా విసిరింది. ఆ ఆనందంలో శ్రీధర్ 'సోనీ'ని అస్సలు పట్టించు కోకుండా శ్రీమతినే కన్నార్పకుండా చూసాడు రెండుక్షణాలు బస్సునుంచి దిగిన ఇద్దరు ముగ్గురు 'సోనీ'ని నిమిరి దానికి టా టా చెప్పేంతవరకు ఈ లోకంలో పడ్డాడు శ్రీధర్

మాధవిచేతుల్లో గారాలుపోతూ రీవిగా ముడుచుకున్న సోనీని చూడగానే భలే ఈర్ష్య కల్గింది. అతను మాధవి వైపు రెండడుగులు వెయ్యగానే... .... "నవ్వే టోయ్ గుర్తుపట్టానులే...." అన్నట్టు చిన్నగ తోక వూపి, నిర్లక్ష్యంగా ఆవలించింది ఒకసారి సోనీ దాన్ని కిందకి దింపితే ఎక్కడ కందిపోతుందో అన్నట్టు తన చేతుల్లోనే పొదివిపట్టుకుంది మాధవి

కొత్తగా సంసారం పెట్టటం కదా? ఏవేవో సామాన్లు తెచ్చింది ఆ సామానంతా చూసిన శ్రీధర్‌కి రెండు ఆటోలు చాలవనిపించి టాక్సీ మాట్లాడాడు. టాక్సీలో కూర్చోగానే— "ఏవండీ" మీరు చూసిన ఇల్లు బాగుందా? 'సోనీ' ఆడుకో డానికి ఇంటిముందు స్థలం వుందా?" అని అడిగింది. వచ్చిన కోపాన్ని నవ్వులోకి మార్చుకుని— "ఆహాఁ....రాణీ గారు

ఆర్డరు వెయ్యడం అది అమలుపెట్టక పోవడమా?.. నీ సోఫీ ఆడుకోడానికి చక్కటి ఖాళీస్థలం వుంది" అన్నాడు బొచ్చుకుక్కవైపు చూస్తూ మాధవి తృప్తిగా నవ్వుతూ కుక్కని ఎంతో ఆప్యాయంగా నిమురుతూ-"పిచ్చిముండ రాత్రంతా అలా మేల్కొనే కూర్చుంది. అవతల సీట్లో అతను అదే పనిగా నా వంక చూడడం దీనికే మాత్రం నచ్చనట్టుంది గుర్రుగా చూస్తూ నాకు కాపలా కాసింది తెల్సా...."

తన భార్యవంక ఎవరో చూడడం కించిత్ గర్వం కల్గించినా మరో క్షణం నచ్చలేదు తనకి నచ్చనిది కుక్కకికూడా నచ్చకపోవడంతో సోఫీమీద కొద్దిగా ఇష్టం కల్గింది శ్రీధర్‌కి.

మరో పదినిమిషాలకి ఇంటిముందు టాక్సీ ఆగింది. కుక్కనెత్తుకుని టాక్సీ లోంచి దిగింది మాధవి. సామానంతా జాగ్రత్తగా లోపల పెట్టించాడు శ్రీధర్. టాక్సీ ఇంటి ముందు ఆగినప్పట్నుంచి శ్రీధర్ సామాను లోపల పెట్టించేవరకు పక్కింటి వాటాతను గుమ్మంలో నిలబడి చూస్తుండటం గమనించాడు శ్రీధర్. అతనికి సుతరామూ నచ్చలేదు. మర్యాద కోసం ఓ నవ్వు పారేసి లోపలికి వెళ్ళిపోయాడు. మాధవి ఇల్లంతా కలయ తిరుగుతూ చూస్తోంది. తెల్లగా బొద్దుగా మెరిసి పోతున్న "సోఫీ" మాధవి కొంగు పట్టుకున్నట్టుగా తిరుగుతోంది – ఆమె వెంట అతను లోపలికి రావడం చూసిన మాధవి నవ్వుతో-"చాలా మట్టుకు సర్దేసి

100 ml బాటిలు కొని

87 పైసలు ఆదా చేసుకోండి

'త్రివేణి' ఇంకు

ఇప్పుడు లాభకరమైన ప్యాకింగులో
100ml పాలిథీన్ బాటిల్సులో దొరుకుతున్నది.
100ml బాటిలు 1కి వెల రు. 2-80
60ml బాటిలు 1కి వెల రు. 2-20
(స్థానిక పన్నులు అదనం)
వినియోగదార్ల లాభమునకుగాను ప్రకటించుచున్నాము.

తయారుచేయువారు :
కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ
751, తిరువత్తియూరు హైరోడ్, మద్రాసు-600081

నట్టున్నారే...." అంది. ఆమె దగ్గరగా వెళ్ళి ఆమెను రెండు చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు శ్రీధర్...."హోం మినిస్టర్ గారు రాగానే అన్ని రెడీగావుంటే బాగుంటుందని ..." అని నవ్వాడు.

వాళ్ళకి కొద్ది దూరంలో నిలబడ్డ "సోనీ" కన్నార్పకుండా ఇద్దర్నీ చూడ సాగింది. అతని బిగి కౌగిలిలో కరిగి పోతున్న మాధవికి, భార్య స్పర్శానందంలో వున్న శ్రీధర్ కి టైము తెలియ లేదు. రెండు మూడు క్షణాలు అలాగే చూసింది సోనీ. ఆతర్వాత వెనక రెండు కాళ్లమీద కూర్చుని కదలకుండా మరో రెండు క్షణాలు చూసింది.

ఊఁహుఁ....వాళ్ళిలోకానికి రాలేదు. దానికి మాధవి తన్నలా వదిలెయ్యడం నచ్చనట్టు అసహనంగా లేచి నిలబడింది. ఇద్దరి చుట్టూ తిరిగి మాధవి దగ్గరగా వెళ్ళింది.

అప్పటికీ ఆమె దాన్ని పట్టించుకో లేదు. కోపం వచ్చి తలెత్తి లోగొంతులో మొరిగింది సోనీ.

భర్త నన్నగా చెవిలో చెప్తున్న ప్రేమ పదాలు వింటున్న మాధవి తేరుకుని ఈ లోకానికి వచ్చింది.

మళ్ళీ వెనక్కాళ్ళమీద కూర్చుని సీరియస్ గా ఆమొహంలోకి చూసింది సోనీ..

"ఓహ్....ఏమండి....పాలున్నాయా? పాలు కావాలండి....సోనీకి పాల టైము అయింది...." హడావుడిగా భర్తని వదిలించుకుంటూ అన్నది మాధవి. మళ్ళీ ఆ బొచ్చు కుక్కమీద కోపం వచ్చేసింది శ్రీధర్ కి.

దాని మీద ఎంత శ్రద్ధో....అది తన వైపు గుర్రుగా చూస్తున్నట్టని పించింది శ్రీధర్ కి. మాధవి మరో వైపు తిరిగి వుండడంతో చెయ్యెత్తి కొట్టినట్టు అభినయించాడు శ్రీధర్. వెంటనే లేచి నిలబడింది సోనీ డిఫెన్సివ్ గా. చెవులు నిక్క బొడ్చి గయ్ మంది. వెంటనే ఆ గదిలోంచి వెళ్ళి పోయాడు శ్రీధర్-మాధవి దాన్ని నముదాయిస్తున్నట్టు మాట్లాడ్తున్న మాటలు వినిపించుకోకుండా.

ం ం ం

పదింటి లోపల కాఫీలు, టిఫిన్లు తెప్పించుకున్నారు శ్రీధర్ మాధవి. ఆఫీసుకెళుతూ — వంట ప్రయత్నం ఏమీచెయ్యకు మధూ ఆఫీస్ బాయ్ వస్తాడు టిఫిన్ కారియర్ ఇస్తే మీల్స్ పట్టు కొస్తాడు" అని చెప్పాడు.

"అలాగే మీరొచ్చేలోపల ఇల్లంతా అద్దంలా సర్ది వుంచుతాను. సాయంత్రం త్వరగా వచ్చేయండి........" నవ్వుతూ చెప్పింది మాధవి, గుమ్మంలోనుంచుని, "ఓయస్ ...ఆమాట నువ్వు చెప్పాలేమిటి? డబ్బులుపోతే పోయాయి. ఆటోలో వచ్చెయ్యనూ...." హుషారుగా చెప్పి, కులాసాగా బయలుదేరాడు శ్రీధర్.

సాయంత్రం అన్నట్టుగానే అయిదుంబావు కల్లా ఆటోకి రెక్కలు కట్టినట్టు పురుకులు పరుగులుమీద వచ్చాడు. వస్తూ వస్తూ గులాబీలు, మల్లెలు, స్వీట్స్, పచ్చిమిరపకాయ బజ్జీలు తీసుకొచ్చాడు. అతను గేటు తీసుకొని లోపలికి వస్తుంటే గుమ్మంలో నిలబడ్డమాధవి, ఖాళీజాగాలో తిరుగుతున్న సోనీ కన్పించాను. వాళ్ళతో పాటు పక్కవాటా గుమ్మంలో నిలబడ్డ ప్రభాకర్ కూడా కన్పించాడు. శ్రీధర్ ని



చూస్తూనే నవ్వాడతను.

ఇతగాడికింకేం పనిలేదేమిటి పక్క వాళ్ళని చూడడం తప్ప-చిరాకేసింది శ్రీధర్‌కి. అయినా సభ్యత కోసం నవ్వాడు.

వెంటనే అతనికి ఓ అనుమానం వచ్చింది. ఇంతకీ అతను మాధవిని చూస్తున్నాడా? లేకపోతే బొచ్చు కుక్కనా?.... లేకపోతే రెండింటినా? ఊఁహుఁ.... మాధవినే అయ్యుండాలి అనుకోగానే మొహం సీరియస్సయి పోయింది.

"అదేమండి? అలా వున్నారేం?ఒంట్లో బాగులేదా?" ఖంగారుగా అతనితోపాటు లోపలికివస్తూ అడిగింది మాధవి.

"అబ్బెబ్బె. అదేంకాదు........ఏమిటి ఇల్లంతా నిజంగా అద్దంలా సర్దేసినట్టున్నావే...." పక్కింటతన్ని పక్కకి తోసేసి మామూలుగా అయిపోయాడు శ్రీధర్ మాధవి కంగారుచూసి.

కాని బెడ్‌రూంలోకి వచ్చిన అతని మొహం మళ్ళీ సీరియస్సయిపోయింది.

"ఇదేమిటి మధూ నేను బెడ్‌పక్కన ప్రత్యేకంగావేసిన సన్‌గ్లాస్ టేబిల్ ఏదీ?"

"ఓ....అదా....మరి సోనీకి నా బెడ్ పక్కనే పడుకోడం అలవాటండీ, అందుకని ఆ టేబిల్‌ని డైనింగ్ టేబిల్ పక్కన వేశాను, దానిమీద గిన్నెలన్నీ పెట్టుకుని భోజనం మాత్రం డైనింగ్ టేబిల్‌మీద చేస్తే విశాలంగా కూడా వుంటుంది. అసలది మన మంచంపక్కన ఎందుకండీ....వేస్టు కదా?"

వేస్టా-ఒళ్ళు...మండిపోయింది శ్రీధర్‌కి. తనెంత వూహతో ఆ టేబిల్‌ని అక్కడ వేశాడు - దానిమీద రాత్రిపూట అగరొత్తులు వెలిగించిపెట్టుకుందామని, పళ్ళు,పాలు మాధవి అమరిస్తే బెడ్‌మీద కూర్చుని అవి తింటూ తియ్యతియ్యగా కబుర్లు చెప్పుకుంటూ....ఈవిడగారి కుక్క సుఖసౌఖ్యాలు, దాని అలవాట్లు తప్ప

మిగతా విషయాలేమీ దృష్టిలోకి వచ్చేట్లు లేవే.

"అదేమిటండి? అలా నిలబడి పోయారు?"

"అది నీ బెడ్‌పక్కన పడుకోక పోతే నీకు నిద్రరాదా? దానికి రాదా?" సగం నవ్వుతూ సగం సీరియస్‌గాను అన్నాడు.

మాధవి దగ్గరగా వచ్చి అతని షర్టు గుండీలు విప్పుతూ గోముగా–"మీకు కోపం వచ్చినట్టుగా వుంది మీకిష్టం లేక పోతే దాని బాస్కెట్ ఇంకోవైపుకి మారుస్తాను లెండి. మీరు వేసినట్టుగా టేబిల్ మళ్ళీ పెట్టేద్దాం" అతని కళ్ళ ల్లోకి చూస్తూ అన్నది.

దాంతో అంతటి మనిషి ఐస్ అయి పోయాడు. భార్య కాంప్రమైజ్ అయ్యే సరికి అతను తన హీరో లక్షణం-దయా గుణం-చూపించదల్చుకున్నాడు. ఆమెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని– "ఇట్సాల్ రైట్ మధూ నీకిష్టం అయిన దాన్ని నేను మాత్రం కాదంటానా? సోనీ బాస్కెట్ అక్కడే వుంచుకొని ఆ టేబిల్ మాత్రం బెడ్‌కి ఇవతలవైపు వేద్దాం" అని తనెందుకు ఆ టేబిల్ అక్కడ వేశాడో వివరించాడు శ్రీధర్

సోనీకి బిస్కెట్లు వేసి, శ్రీధర్ తెచ్చిన పొట్లాలు విప్పింది మాధవి.

ం ం ం

ఆ రోజు ఆదివారం బద్ధకంగా ఒళ్లు విరుచుకుని కళ్ళు విప్పాడు శ్రీధర్. ఎదురుగా గోడ గడియారం సరిగ్గా అప్పుడే తొమ్మిది గంటలు కొట్టింది. "మధూ" ముద్దుగా పిల్చాడు శ్రీధర్.

"........"

"మధూ...." ఈ సారి స్వరం హెచ్చింది.

"........"

"ఓ....మధూ...." అరిచినట్టు కేక పెట్టాడు.

"ఆఁ....ఆఁ....వస్తున్నానండి....." తనూ అంతే స్థాయిలో జవాబిచ్చింది మాధవి. మరో అయిదు నిమిషాలకి దర్శనం ఇచ్చింది ప్రియ శ్రీమతి. అతని వైపు కనీసం కన్నెత్తయినా చూడకుండా చేతిలో వున్న సోనీని కిందకి దింపి టర్కీ టవల్‌తో తుడుస్తూ– "అమ్మయ్య-లేచారా....ఎంతకీ లేవరేమిటాని చూస్తున్నాను-లేపితే కోపం వస్తుందేమో అనుకున్నాను. ఏవండీ ...ఇవాళ దీనికి స్నానం చేయించేసరికి తల ప్రాణం తోక్కి వచ్చిందనుకోండి ఎంత అల్లరి పెట్టిందనుకున్నారు. దొంగముండ ..కాఫీ డికాషను తీసుంటే నా కొంగుతో ఆడుకోడం... తన్నేద్దామనుకున్నాను........" చెప్పుకుపోతూ దానికి పౌడరు రాయడంలో అతి శ్రద్ధగా మునిగిపోయిన భార్యని చూస్తుంటే కోపం చరచరా పాకింది శ్రీధర్‌కి. రెండురోజులు చూసి నేనే తన్నేస్తాను. అసలు ఆదివారం ఎంత తియ్యగా మొదలవ్వాలి. అలా మొదలవ్వాలంటే మొదలు శ్రీమతి తియ్యని మాటలతో, తియ్యని ముద్దులతో భర్తని నిద్ర లేపాలి... ఎంత తియ్యటి స్వీట్ నథింగ్స్ అవి....హు..,ఈ వెధవ కుక్క మూలంగా తనకవన్నీ దూరం అయి పోతున్నాయి.

వెంటనే అలిగేద్దాం అనుకున్నాడు శ్రీధర్. కాని అలిగితే సరిగ్గా అలగాలి.

అంటే...... మంచంమీదనుండి కదల కూడదు. మొహం కడుక్కోకూడదు ఆవిడొచ్చి తెగబతిమాలేవరకు కాఫీ తాక్కుండా బెట్టు చెయ్యాలి ఆ తర్వాత తనని బలవంతంగా మంచంపైనుండి లేపి బాత్రూమ్‌లోకి తీసుకెళ్ళి స్నానం చేయించాలి... ఇలాగే బతిమల్తూ టిఫిన్ తినిపించాలి... అబ్బా....అలగడం అంటే మాటలా.. ఇవన్ని....అంటే తను అలిగితే ఏం చెయ్యాలి....తన అలక ఎలా తీర్చాలి అన్న రూల్స్....పాపం మాధవికి తెలియవు కదూ?....తనిప్పుడు అలిగితే ఆవిడ సరిగ్గా తన రూల్స్ ప్రకారం నడుచుకోకపోతే....తన ప్రిస్టేజ్ అంతా కరిగి నీరయి మురిక్కాలవలో కలిసి పోతుంది. అందుకే మధుకి తన అలక రూల్స్ తెలిపేవరకు తను అలక్షూడదు. సో....అలక కాన్సిల్....

మంచంమీద లేచి కూర్చున్నాడు శ్రీధర్. సోనీకి పౌడర్ రాస్తూ-"లేచి మొహం కడుక్కోండి కాఫీ రెడీగా వుంది" అంది మాధవి.

ఉస్సురని లేచి బాత్రూమ్‌వైపు నడిచాడు శ్రీధర్ ఒకమాదిరి విశాలంగా వున్న పెరట్లో ఎవరి వాటావైపు వారి బాత్రూమ్, లెట్రిన్స్ కట్టివున్నాయి. యధాలాపంగా తల తిప్పి చూసిన అతనికి ప్రభాకర్ భార్య తులసికోటదగ్గర పూజ చేసుకుంటూ కన్పించింది. ఆమె శ్రీధర్‌ని చూస్తూనే అతి సీరియస్‌గా ఓ చూపు విసిరి తల తిప్పేసుకుంది. ఆమె వింత ప్రవర్తనకి క్షణం విస్తుపోయి తన



కేందుకు లెమ్మనుకుని తనపని పూర్తి చేసుకుని లోపలికి వచ్చాశాడు శ్రీధర్.

పౌడరు రాయడం పూర్తిచేసి 'సోసీ' తెల్లటి బొచ్చుని దువ్వుతోంది మాధవి. మొహం తుడుచుకుంటూ అద్దంలో చూసు కుంటున్న భర్తతో-"ఏవండీ..ఈపక్క వాటా ఆవిడలేదూ....ఆవిడ పద్ధతి నాకేం నచ్చలేదు" కాస్త గొంతు తగ్గించి అన్నది మాధవి.

"ఏం...." ఏమీ ఎరగనివాడిలాగా అన్నాడు.

కొత్తగా సంస్కారం లేని మనిషి లాగా వుంది. పెరట్లో కనిపిస్తే ఎంత యినా కొద్దిరోజులు కలసి వుండేవాళ్ళం కదాని నవ్వుతూ పలకరించబోతే మొహం తిప్పుకుని లోపలికి వెళ్ళిపోయింది. నేను సోసీకి స్నానం చేయిస్తుంటే తలుపు పక్కన తారట్లాడడం చూశాను"

"కలుపుగోలుమనిషి కాదేమో....అయినా వాళ్ళు ఎలావుంటే మాత్రం మనకెందుకు లెద్దూ...." అయితే భర్తకేమో పక్కింటి వాళ్ళతేనే చూసే జబ్బు....భార్యకేమో పక్కింటి వాళ్ళంటే గిట్టదు....చిత్రమైన జంట....క్రాఫ్ చేత్తోసరిచేసుకుంటూ అను కున్నాడు.

"అదికాదండి, ఎంతయినా ఇరుగు పొరుగు వాళ్ళం కదా? కాస్త స్నేహంగా వుంటే ఏం పోయిందండి" అంది లేచి నిలబడుతూ.

"ఆవిడ కేంపోతుందో మనకేం తెలు స్తుంది చెప్పు....ఇంతకీ ఇవాళ టిఫిన్ ఏమిటి శ్రీమతిజీ...." మాట మార్చేశాడు శ్రీధర్.

"పెసరట్టు వుప్మా ప్లస్ కొబ్బరి చెట్నీ, కారప్పొడి, నెయ్యి, మంచినీళ్ళు.. ఇవన్నీ పెట్టుకోడానికి డైనింగ్ టేబిల్, అమర్చడానికి శ్రీమతి, తినడానికి శ్రీవారు...." నవ్వుతూ అంది మాధవి.

"గుడ్...నీకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ వుందన్నమాట....నాకు ఎప్పుడూ సీరి యస్‌గా వుండేవాళ్ళంటే మంట...." శ్రీమతి పైటచెంగు లాక్కుని ఆమెని దగ్గరగా తీసుకున్నాడు. ఆమె అతని కౌగిటిలో కరుగుతూ—"అయితే మీకు పక్కింటావిడంటే మంటన్నమాట...." నవ్వేసింది.

"చాల్లే.......ఆవిడ వింటే మూడో ప్రపంచయుద్ధం మొదలవుతుంది!

o o o o

రోజు శ్రీధర్ వచ్చే టైముకి మాధవి. సోసీ వాకిట్లో వుండడం, వీళ్ళని ముఖ్యంగా మాధవిని (అదే శ్రీధర్ గట్టి నమ్మకం) చూడడానికి పక్కింటి వాటా గుమ్మంలో ప్రభాకర్ నుంచోనివుండడం రొటీన్ అయిపోయింది. ఇది ఏ మాత్రం నచ్చడంలేదు శ్రీధర్‌కి. పోసీ అలా సాయంత్రాలు బయటనుంచోవద్దని, బొచ్చుకుక్కతో ఆడుకోవద్దని చెప్దా మని ఎన్నోసార్లు నోటి చివరిదాకా వచ్చి కూడా అభిమానపడి నోరు కట్టేసుకు న్నాడు. అలా చెప్తే మాధవి ఏం అను కుంటుంది. పుట్టి అనుమానపుపక్షి అనుకోదూ....అమ్మో అలాంటిరిమార్క్ తన హీరోయిజానికి గొడ్డలిపెట్టులాంటిది. పోసీ ప్రభాకర్‌తో చెప్తేనో....తన్నో ఫూల్ కింద చూసి-నేను మీ ఆవిణ్ణి చూడడంలేదు....బొచ్చుకుక్కని అంటే? అసలు నేను నుంచునేది నా వాటా



గుమ్మంలో... చల్లగాలికోసం...అంతేనో ఛ....ఇవేమి కుదిరే పద్ధతులు కాదు.... ఖాళీ దొరికినప్పుడల్లా ఆఫీసులో... రోడ్డు మీద....రాత్రిపూట మంచ మీద....నిద్ర పట్టనప్పుడు....తెగ ఆలోచిస్తున్నాడు.

ఆరోజు సాయంత్రం అతను ఆఫీసు నుంచి వచ్చేసరికి అతనికి కళ్ళు బైర్లు కమ్మినంత పనయింది. ఏమిటీ? ప్రభాకర్ గుమ్మంలో కాక గుమ్మం ఇవతలకి రెండడుగులు ఇవతలకి వేసి నుంచున్నాడు, ఇకిలిస్తూ....మాధవి బొచ్చుకుక్క వైపు బంతి విసురూ ఏదో అంటోంది. ఒళ్ళు మండి పోయింది శ్రీధర్‌కి. ఇక లాభం లేదు. వీడు మెల్లగా మాధవిని మాటల్లో కూడా పెట్టున్నాడు. దీనికేదో పరిష్కారం ఆలోచించాలి....

....హల్లో....ఎంతో స్నేహంగా పలకరించాడు ప్రభాకర్. పెదాలు కదలీ కదలనట్టుగా సమాధానం ఇచ్చి గబగబా లోపలికి వచ్చాడు శ్రీధర్. వెనకేమాధవి, ఆమెతో పాటు, బొచ్చుకుక్క లోపలకి వచ్చారు.

"ఏవడీ.... పాపం పక్కింటతను ఎంత మంచివాడు అనుకున్నారు. అతనికి బొచ్చుకుక్కంటే ఎంతో ఇష్టం అట ...వాళ్ళావిడకి ఇష్టం లేదట....వాళ్లావిడకేమో ఎవరూ గిట్టరట....ఇతనికేమో ఇరుగు పొరుగుతో స్నేహం చెయ్యాలని వుంటుందట" గబగబా చెప్తోంది మాధవి.

ఊఁహుఁ....అందమైన ఆడవాళ్ళతో స్నేహం చెయ్యాలని వుండదూ? బొచ్చుకుక్కంటే ఇష్టంట.... ఆ సమయంలో మాధవి దగ్గిర పిచ్చికుక్క వున్నా ఇష్టం అనడూ?....ఈవేషాలు తన దగ్గిర కుదరవు....వెంటనే మరో ఇల్లు చూసేసి మారాల్సిందే....గట్టిగా నిర్ణయం చేసుకున్నాడు శ్రీధర్.

ఇలా ఓ వారం రోజులు గడిచిపోయాయి.

ఓ రాత్రి పూట దాహం వేసి మంచినీళ్లు

కోసం లేచాడు శ్రీధర్. టేబిల్ మీద మంచినీళ్ళు పెట్టటం మర్చిపోయినట్టుంది మాధవి అనుకుని వంటింట్లోకి వెళ్ళాడు. బిందెలోంచి మంచినీళ్ళు ముంచుకుంటుంటే వెక్కి-వెక్కి ఏడుస్తున్న శబ్దానికి వులిక్కి పడ్డాడు శ్రీధర్. ఎక్కణ్ణుంచాని శ్రద్ధగా విన్నాడు.... పక్కవాటాలోంచి స్పష్టంగా వినిపిస్తోంది. కుతూహలం అణుచుకోలేక గోడ దగ్గరగా వెళ్ళాడు శ్రీధర్.

"నాకన్నీ తెల్సు....నేను అందంగా లేననే కదా....ఆ పక్కింటావిడ వైపు ఇంతంత కళ్ళు చేసుకుని చూస్తున్నారు"

"ఛ....ఛ.... నీకెప్పుడు అనుమానమే, నిన్ను చూస్తే...." విసుక్కుంటున్నాడు ప్రభాకర్ లోగొంతులో.... గోడకి అతుక్కుపోయి వింటున్నాడు శ్రీధర్, "అనుమానం కాకపోతే మీరు చేస్తున్నదేమిటి? రోజూ సాయంత్రం అలా గుమ్మంలో మంత్రించిన బొమ్మలాగా నిలబడడం ఎందుకు? పైగా ఈ మధ్య మాటలు కూడా మొదలు పెట్టారు...." వెక్కిళ్ళ స్థాయిలోకి వొచ్చింది.

"నోర్మూయ్. నీ సంకుచిత బుద్ధి బయట పెట్టుకుంటున్నావు నీ ఇన్ఫీరియర్ కాంప్లెక్స్‌తో నాప్రాణాలు తీస్తున్నావు. అయినా నేను గుమ్మంలో నిలబడేది నువ్వనుకునే దానికి సంబంధం లేదని చెప్తున్నాను-నమ్మకపోతే నీఖర్మ" విసురుగా ఏదో పడ్డది కింద.

"ఆఁ....నాఖర్మే... అంతా నాఖర్మ. చేస్తున్న వెధవ పనికి సమర్థనలు'' ఆ పైన అయిదునిమిషాలు గడచినా ఏడుపు తప్ప మాటలువినిపించలేదు.... వింటున్న శ్రీధర్ మెల్లగా ఇవతలికి వచ్చేశాడు. అయితే అతని భార్య అనుమానిస్తోందన్న మాట....బహుశా తన అనుమానం ఏ అనుమానం లేకుండా నిజమే అయి వుండాలి.... ప్రభాకర్ భార్య షుమారుగా సంసార పక్షంగా వుంటుంది. కాని మాధవి.... చూడగానే ఆకర్షించే వంపుసొంపులున్నది. అందుకే అతగాడలా ప్రవర్తిస్తున్నాడు తను చూసిన రెండు మూడు ఇళ్ళల్లో ఏదో ఒకటి ఖాయం చెయ్యాలి....అనుకుని తిరిగి బెడ్ రూంలోకి వచ్చేశాడు శ్రీధర్.

ఆ మర్నాడు తనకి నచ్చిన ఇంటికి ఎడ్వాన్స్ ఇచ్చేసి వచ్చాడు శ్రీధర్ ఆ విషయం మాధవికి చెప్తే నిర్ఘాంతపోతూ చూసింది. "అదేమిటండి? ఈ ఇల్లు మనకి సౌకర్యంగానే వుంది కదా? పైగా అన్ని ఇళ్ళకి ముందు ఖాళీ జాగాలు దొరకవు.. పాపం సోనీ హాయిగా ఆడుకుంటోంది." బిక్క మొహం వేసిన మాధవిని చూడగానే కరిగిపోటోయి తమాయించుకున్నాడు.

"సోనీకోసమని నాకునచ్చని ఇంట్లో, నచ్చని పరిసరాల్లో వుండమంటావా?'' నవ్వుతున్న భర్త మాటల్లోని సీరియస్‌నెస్‌ని కనిపెట్టగల్గింది మాధవి. అందుకే మౌనంగా లోపలికి వెళ్ళిపోయింది. ఫస్ట్ మరో వారంలో వుంది. ఫస్ట్ ముందు వచ్చిన ఆదివారాన్ని ఇంటి షిఫ్టింగ్‌కి ముహూర్తం పెట్టుకున్నాడు శ్రీధర్. ఆ రోజు శనివారం. ఆఫీసునుంచి రాగానే టిఫిను చేసి సామాను సర్దడంలో పడ్డాడు శ్రీధర్. అతనికిప్పుడు ఎంతో రిలీఫ్‌గా వుంది మాధవి అతనికి సహాయం

చేస్తోంది. హుషారుగా కబుర్లు చెబుతూ సర్దుతున్న సమయంలో తలుపు తట్టిన శబ్దం అయి లేచి వెళ్ళాడు శ్రీధర్ తలుపు తియ్యగానే కన్పించిన ప్రభాకర్‌ని చూసి ఆశ్చర్యపోయాడు. సభ్యత అడ్డు రాగా...."రండి" అన్నాడు ఇష్టం లేకపోయినా.

అతను ఎంతో చొరవగా లోపలికి వచ్చాడు. లోపలికి వస్తూనే సామాన్లు సర్దుతున్న మాధవివైపు ఆశ్చర్యంగా చూశాడు ప్రభాకర్.

"మీరు ఇల్లు మారుస్తున్నారా?" ప్రపంచంలో ఎనిమిదో వింత మొదటిసారిగా చూసినంతగా తబ్బిబ్బు అయిపోతూ అడిగాడు శ్రీధర్‌వైపు చూస్తూ.

"ఔనండి....ఈ ఇల్లు....పరిసరాలు నాకు నచ్చలేదు" ఎలాగూ వెళ్ళిపోతున్నాం కదాని తన కోపాన్నంతా జోడించి అన్నాడు.

"అలాగా....భలే తమాషాగా వుందండి. మేమూ ఇల్లు మారుతున్నాం" అన్నాడు చెప్పకుండానే అక్కడున్న కుర్చీలో కూర్చుంటూ.

అతని చేతిలో ఏదో పాకెట్ వుంది. శ్రీధర్, మాధవి చాలా ఆశ్చర్యపోయారు ముఖ్యంగా శ్రీధర్

"అదేమండీ" కుతూహలంగా అడిగింది మాధవి.

"ఏం చెప్పమంటారు." పుస్సురని నిట్టూర్చాడతను ఎంతో భారంగా.

ఏం మాట్లాడకుండా ప్రభాకర్‌వైపే చూస్తున్నాడు శ్రీధర్.

"అర్థం చేసుకునే జీవిత భాగస్వాములు దొరకడం నా దృష్టిలో గొప్ప వరమండి. ఎందుకంటే అది నాకు కరువయింది కాబట్టి" అన్నాడు నవ్వేస్తూ.

శ్రీధర్, మాధవి మొహామొహాలు చూసుకున్నారు ఇంతలో సోనీ నోటితో దొరికిన చిత్తుకాగితాన్ని పట్టుకుని వచ్చింది తోక వూపుకుంటూ దాన్ని చూస్తూనే ప్రభాకర్ మొహంలో వెలుగు స్పష్టంగా చూశారిద్దరూ.

"మా ఇంట్లో అందరికీ ముఖ్యంగా నాకు, మా చెల్లికి బొచ్చుకుక్కలంటే

శిశిరస్వరం

ఏకాంత స్మశానంలో
నీతోడి ఆలోచనల
కట్టెలు పేర్చుకుని
స్మృతుల చితికి
నిప్పంటించుకుంటే
చివరకు మిగిలిన
పిడికెడు విషాదం
ఎంత హాయిగా ఉందని!?
జీవితపు పుస్తకాన్ని
వెనక్కు తిప్పి చదువుకున్నప్పుడు
సాగిన కన్నీటి తీగల్ని
మీటిన 'సావేరి' రాగం
ఎంత తీయగా ఉందని!?
నీకు మనసిచ్చిన పాపానికి
అదెప్పుడో ఉరిపోసుకుంది.
ఈ కట్టె మాత్రం ఇంకా
శిలువకు వేలాడుతూనే ఉంది!

గణేష్‌బాబు

చాలా ఇష్టమండి. మా చెల్లెలుకోసం మా నాన్నగారు బొచ్చుకుక్కని తీసుకొచ్చి ఇచ్చారు. మా దురదృష్టంకొద్దీ నా చెల్లెలు రెండేళ్ళ క్రితం స్కూలునుంచి వస్తూ ఏక్సిడెంట్ అయి చనిపోయింది. మా చెల్లెలు అల్లారుముద్దుగా పెంచుకునే బొచ్చుకుక్క దానిమీద బెంగతో తొంకర్లోనే చచ్చిపోయింది, అందుకే. " అతని గొంతు గాద్గదికమయింది.

శ్రీధర్, మాధవి కళ్ళప్పగించి చూస్తుంటారు.

"ఎక్కడ బొచ్చుకుక్క కన్పించినా నా మనస్సు అదోలా అయిపోతుంది. మీ శ్రీమతిగారు ఆ కుక్కతో ఆడుకుంటూంటే మా చెల్లెలు తన కుక్కతో ఆడుకుంటున్న దృశ్యాలు కళ్ళకి కట్టినట్టు కన్పిస్తాయి అందుకే ప్రతిరోజు సాయంత్రం ఆవిడ కుక్కతో ఆడుకుంటూంటే అలా నిలబడి చూస్తాను. దాంతో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ వున్న మా ఆవిక .." క్షణం ఆగి ఇద్దరివైపు చూసి "మరోలా అర్థం చేసుకుంది ఇలా చెప్పడానికి నేను జంకడంలేదు. ఎందుకంటే మీ ఇద్దర్ని చూసినక్షణం ఎలాంటిదో... మీరంటే నా కభిమానం ఏర్పడింది సద్భావం కల్గింది. మీతో స్నేహం చేసుకునే నా కోరిక కోరికగానే మిగలబోతోంది. ఎందుకంటే చెప్పానుగా పరాయి దవాళ్ళతో, అందులోకి కాస్త నదురుగా వున్న ఆడవాళ్ళతో మాట్లాడితే పెడర్థాలు తీసే మా ఆవిడ మూలంగా ఈ ఇల్లు ఖాళీ చెయ్యవల్సి వస్తోంది."

వింటూన్న శ్రీధర్‌కు తను భూమిలోకి కుంచించుకుపోతున్నంతపనయింది. పడమంది తన చుట్టూ నిలబడి అపహాస్యం చేస్తున్నట్టు వుక్కిరి బిక్కిరి అయ్యాడు.

తను మాత్రం వాళ్ళావిడకి ఏం తీసిపోయాడు? అనుమానం, ఈర్ష్యతో మాధవికి ఇష్టం లేకపోయినా తనీ ఇల్లు ఖాళీ చేస్తున్నాడు. అతను చాలా మంచివాడై వుండాలి. లేకపోతే ఇలా వచ్చి చెప్తాడా? కళ్ళల్లో నీళ్ళు తిరిగినంత పనయింది శ్రీధర్‌కి. ప్రభాకర్ మొహంలోకి చూడడానికికూడా సిగ్గేసింది.

"అయ్యొయ్యో....ఎంతపని జరిగింది?" ఎంతో నొచ్చుకుంటూ అంది మాధవి సోనీ ఆమె పక్కనే కూర్చుని ప్రభాకర్‌కేసి చూస్తోంది. అతను చేతిలో వున్న కుక్కబిస్కెట్ల పాకెట్టు శ్రీధర్‌కి అందిస్తూ–

"ఈ కుక్కకి ఈ బిస్కెట్లు ఇస్తే ఎక్కడో వున్న నా చెల్లెలు ఎంతో సంతోషిస్తుంది. దానికి ఇలాంటి కుక్కలంటే ప్రాణం..." అతని కళ్ళల్లో పల్చగా నీరు తిరిగినట్టు శ్రీధర్ గమనించాడు. ఎంతో మనస్ఫూర్తిగా మాట్లాడాడు శ్రీధర్ ఆ క్షణంలో. ఆ క్షణంలో తన మనసులోని మాలిన్యాన్ని కడిగేసుకున్నాడు.

ఈర్ష్యా అసూయలు మనిషిని ఎంత తొందరపాటుకి, పొరపాట్లకి దారి తీస్తుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు శ్రీధర్.

ప్రభాకర్‌కి కాఫీ తేవడానికి లోపలికి వెళ్ళింది మాధవి. శ్రీధర్ పొట్లం విప్పి సోనీకి తినిపిస్తుంటే ఎంతో తృప్తిగా చూశాడు ప్రభాకర్. ★